

sahanamvande.com

epaper.sahanamvande.com

సహనం వందే

హైదరాబాద్ | 23-11-2026 సోమవారం | సంపుటి-02 సంచిక : 201 EDITOR: ROHINI



హిందువులు బతకాలంటే గన్ పట్టాల్సిందేనా?

రాజాసింగ్ హాట్ కామెంట్స్...ప్యూ రీసెర్చ్ వైరల్



ఇంట్లో పిల్లలు, కుటుంబం, ఆస్తిపాస్తులను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ లైసెన్సు కలిగిన తుపాకీ కలిగి ఉండాలా? తెలంగాణ బీజేపీ ఎమ్మెల్యే టి. రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఈ ప్రశ్నను దేశవ్యాప్తంగా చర్చకు తెచ్చాయి. జనాభా మార్పులపై ఆందోళన వ్యక్తం చేస్తూ, స్వీయ రక్షణ కోసం హిందువులు ఆయుధాలు కలిగి ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ వ్యాఖ్యల వెనుక ఆయన చూపుతున్న కారణాలు, వాటికి ఆధారాలేమిటన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

- సహనం వందే, హైదరాబాద్

- ప్రతి కుటుంబానికీ తుపాకీ ఇవ్వాలని ఎమ్మెల్యే డిమాండ్
- ముస్లిం విస్ఫోటనం.. హిందూ భవిష్యత్తు ప్రమాదం
- ప్రపంచంలో హిందూ జనాభా వాటాకు భారీ గండి
- భారత్ మరో పాకిస్థాన్ అవుతుందా?
- మతాల లెక్కలు.. మారుతున్న సమీకరణాలు!

జనాభా మార్పులనే తన వ్యాఖ్యలకు ప్రధాన కారణంగా రాజాసింగ్ చూపారు. దేశంలో జనాభా నియంత్రణ చట్టం అవసరమని చెబుతూ 'హమ్ దో, హమారే దో' నినాదాన్ని ప్రస్తావించారు. అలాంటి చట్టం లేకపోతే భవిష్యత్తులో పరిస్థితులు మారవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు.ఒక వీడియో సందేశంలో ఆయన తుపాకీ పట్టుకుని కొంతమందితో మాట్లాడుతున్న ట్లు కనిపించారు. ఆ వీడియోలో వ్యక్తిగత భద్రత కోసం ఆయుధాలు అవసరమని వాదించారు. స్వీయ రక్షణకు తుపాకీ కూడా ఒక మార్గమన్నది ఆయన అభిప్రాయం.

ముస్లింలు మూడు రెట్లు పెరుగుతారా?

రాబోయే పదిహేను నుంచి ఇరవై ఏళ్లలో దేశంలోని ముస్లిం జనాభా మూడు రెట్లు పెరిగే అవకాశం ఉందని రాజాసింగ్ పేర్కొన్నారు. దీనివల్ల హిందూ సమాజంపై ఎలాంటి ప్రభావం పడుతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. తన వాదనకు మద్దతుగా పాకిస్థాన్ పరిస్థితులను ప్రస్తావించారు. అక్కడ హిందువులు మతపరమైన వేధింపులు, బలవంతపు మతమార్పిడులు, హత్యలు, లైంగిక హింస ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ఇలాంటి పరిణామాలు భవిష్యత్తులో భారత్‌లోనూ చోటుచేసుకోవచ్చని ఆందోళన వెలిబుచ్చారు.



మోడీ తుపాకీ ఆలోచన చేయాలి

అనుమతి ఉన్న ఆయుధాలనే ప్రస్తావించినప్పటికీ, ప్రతి కుటుంబం తుపాకీ తీసుకోవాలన్న ఆలోచనపై చర్చ అవసరం. లైసెన్సు అనేది బాధ్యతాయుత వినియోగాన్ని గుర్తు చేస్తుంది. దేశవ్యాప్తంగా హిందువుల మద్దతుతోనే మోడీ అధికారంలోకి వచ్చారని రాజాసింగ్ వ్యాఖ్యానించారు. తన ప్రతిపాదనలను మోడీ నాయకత్వంలో అమలు చేయవచ్చని విశ్వసిస్తున్నట్లు తెలిపారు. ఇలా తన డిమాండ్‌ను వ్యక్తిగత అభిప్రాయానికే పరిమితం చేయకుండా దేశ నాయకత్వంతో ముడిపెట్టి మాట్లాడారు.

రచ్చలేపిన ప్యూ రీసెర్చ్ సెంటర్ రిపోర్ట్...

రాజాసింగ్ వ్యాఖ్యలు చేయడానికి కారణం ప్యూ రీసెర్చ్ సెంటర్ రిపోర్ట్. ఆ రిపోర్ట్ అంచనాల ప్రకారం, ప్రపంచ మతాల జనాభాలో రాబోయే దశాబ్దాల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకోవచ్చు. ప్రస్తుతం అత్యధిక జనాభా కలిగిన మతంగా క్రైస్తవం ఉండగా, రాబోయే పదేళ్లలో ఇస్లాం ఆ స్థానానికి చేరే అవకాశం ఉందని అంచనా. 2035 నాటికి ముస్లింల జనాభా 257 కోట్లకు, క్రైస్తవుల సంఖ్య 252 కోట్లకు చేరవచ్చని నివేదిక పేర్కొంటోంది.



హిందూ జనాభా వాటాకు గండి...

హిందువుల జనాభా పెరిగినా ప్రపంచ జనాభాలో వారి వాటా తగ్గవచ్చని అంచనా ఆ రిపోర్ట్ అంచనా వేసింది. 2070 నాటికి అత్యధిక ముస్లింలు ఉన్న దేశంగా పాకిస్థాన్ మారవచ్చని, ఆ తర్వాత భారత్, నైజీరియా, ఇండోనేషియా నిలవవచ్చని పేర్కొంది. ఈ మార్పులకు మతమార్పిడుల కంటే పిల్లల జననాలే ప్రధాన కారణమని ప్యూ విశ్లేషించింది. భారత్‌లో ముస్లిం జనాభా వాటా గణనీయంగా పెరుగుతుందని అంచనా వేసింది.

హిందువుల కంటే ముస్లిం జననాల రేటు రెట్టింపు...

ఇస్లాంలో జనాభా పెరుగుదల వేగం ఎక్కువగా ఉందని నివేదిక పేర్కొంది. 2020 నుంచి 2025 మధ్య ముస్లిం మహిళలు సగటున 3.1 మంది పిల్లలకు జన్మనివ్వగా, హిందూ తదితర మతాల మహిళల్లో ఈ సగటు 1.6గా ఉందని తెలిపింది. హిందువుల కంటే ముస్లిం జననాల రేటు రెట్టింపు స్థాయిలో ఉండటం గమనార్హం. ఇదే కాలంలో ముస్లిం తల్లులకు సుమారు 25.2 కోట్ల మంది పిల్లలు పుట్టినట్లు రిపోర్ట్ అంచనా వేసింది. ఈ జననాల ధోరణి భవిష్యత్తులో ప్రపంచ జనాభా లెక్కలపై ప్రభావం చూపవచ్చని నివేదిక పేర్కొంది.

బూతు గేమ్.. యూత్ టెంప్టేషన్

గ్రాండ్ తెఫ్ట్ ఆటో 6 వీడియో గేమ్ రచ్చ

- హింసను ప్రేరేపించే మాయా ప్రపంచం
- 17 ఏళ్లు పైబడిన వారికే అనుమతి
- ఆసక్తి రేపుతున్న ఆట.. తల్లిదండ్రుల ఆందోళన

వీడియో గేమ్స్ ప్రపంచంలో ఇప్పుడు గ్రాండ్ తెఫ్ట్ ఆటో 6 గురించే చర్చ నడుస్తోంది. దాదాపు 13 ఏళ్ల విరామం తర్వాత ఈ సిరీస్‌లో కొత్త గేమ్ రావడంతో యువతతో పాటు పిల్లలు, టీనేజర్లలోనూ ఆసక్తి కనిపిస్తోంది. స్నేహితుల మధ్య మాటలు, యూట్యూబ్, టిక్‌టాక్ వంటి సోషల్ మీడియా వేదికల్లో వీడియోలు, లైవ్ ప్రసారాలు పెరగడంతో ఈ ట్రెండ్ వేగంగా విస్తరిస్తోంది. అయితే ఇందులోని హింస, పెద్దలకు మాత్రమే అంశాలు తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.

- సహనం వందే, హైదరాబాద్



ఈ గ్రాండ్ తెఫ్ట్ ఆటో 6 గేమ్‌లో నేరాలు, కాల్పులు, దాడులు, రక్తపాతం వంటి హింసాత్మక దృశ్యాలతో పాటు నగ్నత్వం, లైంగిక అంశాలు, బూతు మాటలు, మాదకద్రవ్యాలు, మద్యం వినియోగం కనిపిస్తాయి. ఈ కారణాల వల్లే అమెరికాలోని ఒక వయోపరిమితి సంస్థ ఈ గేమ్‌ను 17 ఏళ్లు పైబడిన వారికి మాత్రమే తగినదిగా వర్గీకరించింది. కేవలం వినోదం కోసమేనని భావించి వీటిని తేలిగ్గా తీసుకోవద్దని నిపుణులు సూచిస్తున్నారు.

హింసాత్మక ప్రవర్తనపై ఏం చెబుతున్నారంటే?

ఈ గేమ్ ఆడితే పిల్లలు హింసాత్మకంగా మారుతారా అన్న ప్రశ్నపై జరిగిన పరిశోధనల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కొన్ని అధ్యయనాలు హింసాత్మక గేమ్స్, దూకుడు ప్రవర్తన మధ్య సంబంధం ఉండవచ్చని సూచించగా, మరికొన్ని పిల్లల వ్యక్తిత్వం, కుటుంబ వాతావరణం, స్నేహితుల ప్రభావం వంటి అంశాలనూ పరిగణనలోకి తీసుకోవాలని చెబుతున్నాయి. 2020లో అమెరికా మానసిక వైద్య సంఘం కూడా హింసాత్మక వీడియో గేమ్స్ వల్ల వాస్తవ జీవితంలో హింసాత్మక ప్రవర్తన పెరుగుతుందని నిర్ధారించడానికి తగిన ఆధారాలు లేవని పేర్కొంది. గేమ్ ఆడిన ప్రతి ఒక్కరూ హింసాత్మకంగా మారతారని చెప్పలేం కానీ, ఆ దృశ్యాల ప్రభావాన్ని పూర్తిగా కొట్టిపారేయలేమని నిపుణులు అంటున్నారు.

మానసిక పరిపక్వత... స్నేహితుల ఒత్తిడి కీలకం

టీనేజర్లకు ఈ గేమ్ అనుమతించవచ్చా అన్నదానికి అందరికీ ఒకే సమాధానం ఉండదని బాలల మనస్తత్వ నిపుణురాలు డాక్టర్ షెరిల్ జీగ్లర్ అభిప్రాయపడ్డారు. వయసుతో పాటు కల్పిత ప్రపంచానికి, నిజ జీవితానికి మధ్య తేడా గుర్తించగలరా, తప్పు ఒప్పులపై అవగాహన ఉందా అనే మానసిక పరిపక్వతను చూడాలని ఆమె సూచించారు. యుక్తవయసులో మెదడులోని ఆలోచన, నియంత్రణ, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాలు ఇంకా అభివృద్ధి చెందుతుంటాయి. మరోవైపు ఇంట్లో ఆడనివ్వకపోయినా సోషల్ మీడియా వీడియోలు, స్నేహితుల ఇళ్లలో ఆడే అవకాశాలు ఉండటంతో పాటు అందరూ ఆడుతున్నారనే ఒత్తిడి టీనేజ్‌లో ఎక్కువగా ఉంటుంది.

పర్యవేక్షణతోనే దీర్ఘకాలిక పరిష్కారం

పిల్లలు గేమ్ అడిగినప్పుడు నేరుగా వద్దని అనకుండా, పెద్దలకు మాత్రమే ఉన్నాయని, నీ వయసుకు ఇది సరైనది కాదని శాంతంగా వివరించాలని డాక్టర్ షెరిల్ జీగ్లర్ సూచించారు. ఒకవేళ అనుమతిస్తే మొదట్లో పక్కనే ఉండి గమనించడం, ఇన్-గేమ్ ఖర్చులపై పరిమితులు పెట్టడం, పేరెంటల్ కంట్రోల్ సెట్టింగ్స్ వాడటం అవసరం. చదువు, నిద్ర తగ్గడం, ఆట ఆపమంటే అతిగా కోపం రావడం, ఇతర ఆసక్తులు తగ్గడం, కుటుంబంతో మాట్లాడకపోవడం వంటి మార్పులు కనిపిస్తే వెంటనే జోక్యం చేసుకోవాలి. నిషేధం తాత్కాలికంగా పనిచేయవచ్చు కానీ, తల్లిదండ్రులపై ఉండే నమ్మకం, మంచి చెడులను విచక్షణతో అర్థం చేసుకునే శక్తి పిల్లలకు అండగా నిలుస్తాయి.

రోజుకు ఏడు కోట్లు పంచేస్తున్నాడు

హెచ్‌సీఎల్ వ్యవస్థాపకుడు శివ్ నాడార్ దాతృత్వం

- ఈ ఏడాది ఆయన దానధర్మాలు రూ. 2,593 కోట్లు
- ఎడెల్‌గివ్ హురున్ ఇండియా దాతృత్వ జాబితా వెల్లడి
- మొత్తం రూ. 11,554 కోట్లు దానం చేసిన కుబేరులు
- అదానీ రూ. 877 కోట్లు... అంబానీ రూ. 620 కోట్లు
- విరాళాల్లో విద్య, వైద్య రంగాలకే పెద్దపీట

డబ్బు సంపాదించాలంటే తెలివి, కష్టం ఉండాలి. కానీ సంపాదించిన డబ్బులో కొంత ఇతరుల కోసం ఖర్చు చేయాలంటే పెద్ద మనసు ఉండాలి. ఇప్పుడు దేశంలోని కొందరు కుబేరులు ఇదే విషయాన్ని చాటుతున్నారు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏడాదిలో ఏకంగా రూ. 11,554 కోట్లను సమాజ సేవ కోసం ఇచ్చారు. దేశంలోని సంపన్నులు ఇప్పుడు 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఈ స్థాయి విరాళంగా అందించారు. ఈ జాబితాలో మొత్తం 219 మందికి చోటు దక్కగా, గత ఏడాదితో పోలిస్తే 45 మంది కొత్తగా చేరారు. మొత్తం విరాళాల్లో 68 శాతం వాటా రూ. 100 కోట్లు అంతకంటే ఎక్కువ విరాళాలిచ్చిన వారు 19 మంది ఉండటం విశేషం. - సహనం వందే, హైదరాబాద్



ఎడెల్‌గివ్ హురున్ ఇండియా దాతృత్వ జాబితా-2026 ప్రకారం... హెచ్‌సీఎల్ సంస్థ వ్యవస్థాపకుడు శివ్ నాడార్ కుటుంబం వరుసగా ఐదో ఏడాది కూడా దేశంలోనే అగ్రగామి దాతగా నిలిచింది. గత ఏడాదితో పోలిస్తే విరాళాలు నాలుగు శాతం తగ్గినప్పటికీ, ఈ కుటుంబం ఏడాదిలో రూ.2,593 కోట్లు అందించింది. అంటే రోజుకు సుమారు రూ. 7 కోట్లు ఇచ్చారు. మరోవైపు, గత ఏడాది రూ. 386 కోట్లు ఇచ్చిన అదానీ కుటుంబం ఈసారి విరాళాలను 127 శాతం పెంచు కుని రూ. 877 కోట్లతో మూడు స్థానాలు ఎగబాకి రెండో స్థానానికి చేరింది.అయినప్పటికీ, శివ్ నాడార్ విరాళాలు అదా నీ కుటుంబం కంటే రూ. 1,716 కోట్లు ఎక్కువగా ఉన్నాయి.

అంబానీని దాటిన బజాజ్... టాప్-10 జాబితా ఇదే

మూడో స్థానం కోసం జరిగిన పోటీలో బజాజ్ కుటుంబం 42 శాతం వృద్ధితో రూ.632కోట్లు విరాళమిచ్చింది. రూ. 620కోట్లు ఇచ్చిన ముఖేష్ అంబానీ కుటుంబాన్ని కేవలం రూ. 12 కోట్ల స్వల్ప తేడాతో బజాజ్ కుటుంబం వెనక్కి నెట్టింది. ఇక టాప్-10 జాబితాలోని మిగిలిన స్థానాల్లో నందన్ నీలేకణి (రూ.380కోట్లు), కుమార మంగళం బిర్లా కుటుంబం (రూ.366 కోట్లు), సైరస్ పూనావాలా-అదార్ పూనావాలా (రూ.336 కోట్లు), సుధీర్ మెహతా-సమీర్ మెహతా (రూ.334 కోట్లు), కొత్తగా జాబితాలోకి వచ్చిన రంజన్ పాయ్ కుటుంబం (రూ.219 కోట్లు), రోహిణి నీలేకణి (రూ.215 కోట్లు) వరుసగా ఐదు నుంచి పది స్థానాల్లో నిలి చారు. ఈ పది మంది అగ్ర దాతలే రూ. 6,572 కోట్లు సమాజానికి అందించారు. అంటే మొత్తం విరాళాల్లో వీరే సగానికి పైగా ఇచ్చారు.

సొంతంగా ఎదిగినవారే ఎక్కువ...

వారసత్వ సంపద ఉన్నవారే కాకుండా సొంత కష్టంతో ఎదిగిన 125 మంది దాతలు మొత్తం విరాళాల్లో 65 శాతం వాటాను అందించారు. మహిళా దాతల సంఖ్య 24 నుంచి 29కి పెరగగా, రోహిణి నీలేకణి తొలి స్థానంలో, కిరణ్ మజుందార్ షా ఆ తర్వాతి స్థానంలో నిలిచారు. నగరాల వారీగా చూస్తే ముంబై నుంచి అత్యధికంగా 64 మంది దాతలుండగా, న్యూఢిల్లీ నుంచి 41 మంది, బెంగళూరు నుంచి 20 మంది జాబితాలో చోటు సంపాదించారు. విరాళాల విషయంలో మాత్రం ఢిల్లీ దాతలు రూ. 3,168 కోట్లు అందించి అగ్రస్థానంలో నిలిచారు.

విద్య, వైద్య రంగాలకే పెద్దపీట...

రంగాల వారీగా చూస్తే మొత్తం 200 మంది దాతలు విద్యారంగానికి అత్యధికంగా రూ.4,188 కోట్లు అందించగా, వైద్యరంగానికి గత ఏడాది కంటే 82 శాతం వృద్ధితో రూ.1,768 కోట్ల సాయం అందింది. చదువుకు దూరమవుతున్న విద్యార్థుల భవిష్యత్తును, వైద్యానికి నోచుకోని పేదల ప్రాణాలను నిలబెట్టేందుకు ఈ నిధులు ఎంతో కీలకం. అయితే వేల కోట్ల విరాళాలు ప్రకటించడంతో పాటు, ఆ సాయం వల్ల ఎంతమంది పేద విద్యార్థులకు చదువు అందింది, ఎంతమంది రోగుల జీవితాల్లో వెలుగు నిండిందన్నదే అసలైన ప్రశ్న.ఎందుకంటే సంపదకు నిజమైన విలువ వచ్చేది అది సమాజంలో తీసుకొచ్చే వాస్తవ మార్పుతోనే.